# ఎదురీత

"ఇదిగో! ఏయ్! నిన్నే శకుంతలా!" వస్తూనే పిలుస్తూ సత్యనారాయణ చేతిలోని పేపరు టేబిలు మీద విసిరికొట్టి కుర్చీలో కూర్చున్నాడు.

"ఏఁ! పిల్చేది నిన్ను కాదూ?" అధికార స్వరంలో వాల్యూం పెద్దది చేశాడు సత్యనారాయణ.

"ఆఁ వస్తున్నా, ఇవ్వాళేం పుణ్యం పుట్టింది-కాలేజీ నుంచి యింత పెందరాళే వచ్చారు?" చేతిలో వున్న 'టీ' పొట్లాంతో ఒయ్యారం ఒలకపోసుకొంటూ వరాండాలోకి వస్తూన్న శకుంతలను చూచిన ప్రతివాడూ సినిమాలోని దుష్యంతుడు లాగా ఒళ్లు మరచి పోక పోయినా, హృదయంలో కలిగిన సంచలనాన్ని అణచుకొనే ప్రయత్నంలో కొంచెం అటూ ఇటూ అవొచ్చు.

చురచురా చూస్తూ తన్ను అసహ్యించుకొంటున్న సత్యనారాయణ వాలకం అర్థంకాక వాకిట్లో ఆగి "టీ కాయమంటారా? ఓవల్‌టిన్ కలపమంటారా?" అంది శకుంతల.

మాస్టరుగా రబ్బాయి ఎందుకు పడుస్తూ పోతున్నాడు మనింట్లోనుంచి? కోటు తీసి బుజాన్ని వేసుకొని మధ్యహాల్లోకి వస్తూ అన్నాడు సత్యం.

గతుక్కుమంది శకుంతల. "ఏమో నాకేం తెలుసు ?"

"అవును నీకేం తెలుస్తుంది! పిల్లల్ని పీక్కు తిన డంకంటే !"

"ఐనదానికీ కానిదానికీ, అనవసరంగా నన్న నకండి!" అన్నది రోషంతో శకుంతల.

"అనేదేమిటి ? అత్త కొట్టిందని చెప్పలే వాడు నాతో ఏడుస్తూ ?"

"అడ్డమైన కోతి వెధవలంతా వచ్చి యింట్లో వన్నీ యిష్టమొచ్చినట్లు విసిరేస్తుంటే చూస్తూ ఊరుకో మంటారా ? అసలా వెధవలకు అలుసిచ్చి ఇంతదాకా తెచ్చిందే మీరు."

"పరాయి పిల్లల్ని చీటికి మాటికీ, చీరేస్తుంటే ఊరుకుంటారేం ? వాళ్లమ్మా, నాన్నా ఏమనుకుంటారో ననే ఆలోచనైనా లేదాయె నీకు ?"

"ఏమనుకుంటారు? ఇకమీదయినా ఊళ్లో వాళ్లిళ్ళ మీదికి తోలకుండా ఉంటారు. ముందు ఆ కోతి వెధవల్ని ఇంట్లోకి రానిచ్చేది లేదు" అన్నది అధికార స్వరంతో శకుంతల.

"నీ మొహం! నువ్వు రానిచ్చే దేవిటి ?"

"అంత తీపిగా ఉంటే నెత్తి కెక్కించుకొని ఊరే గండి." రుసరుసలాడుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది శకుంతల, బుసకొడుతూ లోనికి వెళ్ళే పాములాగ.

అసలా సంసార జీవితానికి వచ్చిన చిక్కే అది ! విభిన్న దృక్పథాలలో ఏకత్వం సాధించాలని ఎంత ప్రయ

శ్విస్తున్నారో అంత దూరమౌతున్నారు మానసికంగా ఆ దంపతులు.

చిన్నారి పాపల చిన్ని పెదవులపై చిందులాడే చిరునవ్వుల్లోని అందాన్ని, పసిపాపల అమాయక చూపుల్లోని అమరత్వాన్నీ, పాలబుగ్గల మిసమిసలనూ, లేత హృదయాల బోసీ నవ్వులనూ, చూచి ముగ్ధుడౌతాడు సత్యం. పొరుగింటి మాస్టరుగారి చిట్టితోనూ, శర్మగారి పాపతోనూ, తన ప్రపంచాన్ని నిర్మించుకుంటాడు సత్యం. ఏ కొంచెం తీరిక చిక్కినా ఆ ప్రపంచంలో తన జీవిత సమస్య లన్నింటినీ మరచిపోడానికి ప్రయత్నిస్తాడు.

చీటికీమాటికి ఏడ్చేపిల్లలూ, జీవననదులు ప్రవహించే ముక్కులూ, చొంగ కారేనోరూ మురికి గుడ్డలు, కోతి గంతులూ, అర్ధంకాని కీసరబాసర సొద, చూస్తుంటే శకుంతలకు ఏ హిమాలయాలకో వెళ్ళి పోదామన్నంత విరక్తి కలుగుతుంది ప్రపంచంమీద.

ఏ మాతృత్వాన్ని పొంది స్త్రీ. తన ప్రపంచంలోని అన్నింటికంటే ఎత్తైన శిఖరాన్ని చేరానని గర్విస్తోందో, ఆ మాతృత్వాన్నే అసహ్యించుకొనే శకుంతలను చూస్తే సత్యనారాయణ ఒక్కొక్కప్పుడు ఎంతో బాధపడతాడు. ఆమెలోని ఈ వికృతిని అర్థం చేసుకొనే ప్రయత్నంలో సత్యం పట్టీలు కొడుతున్నాడు. రాను రాను శకుంతల ప్రవర్తన సహించరానిదిగా ఉంది సత్యానికి. ఏ రాతిసో స్త్రీ రూపంలో "చుప్పనాతి" లాగ తనదగ్గరకు రాలేదు గదా! అనుకునేవాడు.

ఇందులో శకుంతల ఎంతవరకు బాధ్యురాలు? అక్కడే సత్యం పొరపాటుపడ్డాడు. శకుంతలలోని యీ మార్పుకు కారణం కొంతవరకు "తన పరివర్తనే" అన్న సంగతి గుర్తించ లేక పోయాడు.

ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు కాబట్టి తల్లిదండ్రులమీద నేరం వేయడానికి వీలులేదు, ఇలాంటి దాన్ని మెడకు గుదిబండలా తగిలించారని.

గుండ్రని మొహం విశాలమైనకళ్లూ, నల్లని జుట్టూ గులాబిరంగు పెదవులూ, ఒయ్యారపు నడకలూ చూచి కేవలం ఆమె అందగత్తె అని మాత్రమే అతను వివాహం చేసుకోలేదు. అవకాశం కొద్ది కలిగిన ఆరునెలల పరిచయంలో కొంతవరకూ, ఆమె అభిరుచులనూ, అభిప్రాయాలనూ తెలుసుకొనే చేసుకున్నాడు. అప్పట్లో ఏ నందనవన పుష్పమో శాపవశాత్తూ ఈ భూలోకంలోకి వచ్చిపడిందను కొనేవాడు. ఏమైనప్పటికి శకుంతల బుద్ధిమంతురాలనే విషయాన్ని అందరూ ఒప్పుకొంటున్నదే.

"ఎందుకు శకూ్కా? పిల్లలంటే నీకింత కసి?" శకుంతల చెక్కిళ్లపై చేతులు వేస్తూ అన్నాడు సత్యం.

"అబ్బా, వదల్లెండి" శకుంతల బుంగమూతి పెట్టి గోడవైపు తిరిగింది.

"మరయితే నీకు ఇష్టేవాళ్ళని పెంచవూ?" అంటూ శకుంతలను తనవైపుకు తిప్పుకొని ఆమె కళ్ళలో దేన్నో వెదుకుతున్నాడు సత్యం.

శకుంతల శరీరం కంపిస్తున్నది. అది అసహ్యాంతోనో, కసితోనో, లేక కోపంతోనో చెప్పడం కష్టమే. సత్యం చేతుల్ని విసిరికొట్టి అక్కడినుంచి విసుగ్గా వెళ్లిపోయింది. శకుంతల.

ఒక పెద్ద నిట్టూర్పు విడుస్తూ మచంమీద కూలబడ్డాడు సత్యం.

"ఈ దయ్యంతో ఇక కాపరం చేయడం అసంభవం! ఇది మాతృత్వంమీద ఛాలేంజిగాఉంది! స్త్రీకి సహజమైన ఆకాంక్ష ఏమైంది? దేవతలాంటి శకుంతలలో దయ్యపు గుణము ఎలా ప్రవేశించింది? ప్రకృతి తన మనుగడ కోసం చేసే ప్రయత్నానికి ఎదురీత! పిల్లల్ని ఇంతగా ద్వేషించే గుణాలు ఆమెలో ప్రవేశించడానికి కారణం?"

"ఐతే పురాణ కాలంనుంచీ ఈనాటివరకూ సంతానంకోసం, మాతృత్వం పొందాలనే తీవ్ర ఆకాంక్షతో ఏ మార్గాన్నయినా తొక్కలేదే పుణ్యస్త్రీలు? కుంతీదేవీ, మాద్రీ మహాపురుషుల ఆశీర్వచనాలతో సంతానం పొంది పుణ్యగతులకు పోలే? ఈనాటి కొన్నికథల్లోని హీరోయిన్‌లు పిల్లలకోసం వ్యభిచరించడం లే? మరెలా నమ్మేది? క్రూర జంతువుల్లో సహితం ఉండే మాతృత్వ వాంఛ మానవజాతిలో లోపించిందే? ఇక మా బ్రతుకులు యిలా తెల్లారవలసిందేనా? పాలబుగ్గల పసి పాపలను పలకరించే యోగం లేదా? నా ప్రతిరూపాన్ని నత్తిమాటలు పలుకుతూ తప్పటడుగులు వేస్తుంటే

చూచే యోగం లేదా ? ఆ శర్మగారి కాంతం చిట్టిని ఎంత ఆత్రంగా హృదయానికి హత్తుకుంటుంది. కనిపించడం కొంచెం ఆలస్యమైతే ! కాస్త ఆలస్యమైతేసరి చేసే చేసే పని వదిలేసి తన బిడ్డను తీసుక పోతుంది నేను ఇలా లోకుల పిల్లలతో సంతోషపడవలసిందేనా ? శకుంతలలో మార్పు రాదా ?"

సత్యం కళ్లనుంచి అప్రయత్నంగా జలజల రాలిన కన్నీళ్లు దిండును తడిపేశాయి. ఆలోచిస్తున్నకొద్దీ బుర్ర వేడెక్కి పోతోంది. ఆ ఇంట్లోని ప్రతి వస్తువుమీదా రోత పుడుతోంది. పక్కగదినుంచి శకుంతల వెక్కిళ్లు వినిపిస్తున్నాయి. సత్యం దిండును రెండు చేతులతో చెవులకు అదుముకుంటూ నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

♦ ♦ ♦ ♦

ప్రపంచం తన చుట్టూ తిరుగుతూనే సూర్యుని చుట్టూ భారంగా ఒకసారి తిరిగింది. సత్యనారాయణ కలలు నిజమౌతున్నాయి. భవిష్యత్తులోని ఆశాజ్యోతి వెలుగునీడలు దగ్గరగా కనిపిస్తున్నాయి. ఇక ఆరుమాసాలకు సత్యం ఒక బిడ్డకు తండ్రి; శకుంతల 'అమ్మ', అవుతారు.

తనకు మూడోనెల అని ఆ రాత్రి శకుంతల చెప్పగానే సత్యం హృదయంలో ఆనందపు అలలు కట్టలు తెంచుకొన్నాయి. తన ఊహా ప్రపంచంలోకి దూరంగా చాలా దూరంగా పోయాడు. శకుంతల వేడి కన్నీటినీ,

గుండె వేగాన్నీ, ఏదో తెలియని బాధనూ గుర్తించేట్టు లేదు సత్యం. ఆ రాత్రి ఇద్దరిలో ఎవరికీ నిద్ర సరిగ్గా పట్టలేదు. తమ భవిష్యత్తును తలచుకొంటూ ఒకరు స్వర్గం లోకి, మరొకరు నరకంలోకీ పోయినట్టున్నారు.

ఉదయం సత్యం కాలేజీకి వెళుతుంటే శర్మగారి చిట్టి 'బాబామ్' అంటూ ఎదురుగా వచ్చింది. చిట్టిని చేతులలోకి తీసుకొని ముఖానికి అదినపొడరు పోయేలా ముద్దు పెట్టుకొని 'మా అబ్బాయితో ఆడుకోడానికి వస్తావా' అన్నాడు.

"ఎక్కలా ?" అమాయకంగా కళ్లు పెద్దవిచేసి అంది చిట్టి.

"పిన్నికడుపులో" అంటూ వాకిట్లోకి వచ్చిన శకుంతలను చూచి నాలుక కరుచుకొని, చిట్టిని దింపి, గబ గబా మెట్లు దిగాడు సత్యం.

"పిన్ని కడుపే కావలసింది! పిన్ని కాదు?" విసురుగా తలుపు మూసి బరువుగా కాళ్ళీడ్చుకుంటూపోయి, యీజీచైర్ లో వాలింది శకుంతల.

పెద్దగా ఏడవబుద్ధవుతుంది. గుబులు గుబులుగా వుంది మనస్సు. తను కొద్దిరోజుల్లో 'అమ్మ' కాదు 'ముసలమ్మ' కాబోతోంది. శరీరం జారిపోతుంది. మొహం ముడతలు పడుతుంది. తనస్వేచ్ఛా జీవితానికి ఒక గుదిబండ పడుతోంది. ఛీ! ఏవిటీ వెధవ ఆలోచన? చాలా ప్రయత్నం చేసింది. ఉబికి వస్తున్న ఆలోచనల్ని అణుచు

కుందామని. టేబుల్ మీద ఉన్న పుస్తకం తీసింది ఏదో చదవాలని, కాదు తన్ను బలవంతంగా పిచ్చెక్కిస్తున్న ఊహాల నుంచి తప్పించుకుందామని. కాని ప్రయోజనం? ఏ ఊహాల్ని అణుచుకోవాలని ప్రయత్నిస్తామో అవే విపరీతంగా వస్తూంటాయి.

ఇప్పటికే ఊళ్లోవాళ్ల పిల్లలతో, పొద్దుట్నుంచీ కాలేజీకి పోయేదాకా, మళ్లీసాయంకాలం తిరిగి వచ్చింది మొదలు తిండి తినేదాకా ఆడుకుంటూ, వాళ్ల లోకం లోనే పడిపోతాడు. తన్ను పూర్తిగా మరిచిపోయిన సత్యం ప్రవర్తన తలచుకొని ఎక్కడో లోతు తెలియని అగాధంలోకి పడిపోయింది శకుంతల.

పెళ్ళయిన మొదటి రోజుల్లో తనంటే ఎంత ప్రేమగా వుండేవాడు! రాత్రింబవళ్ళు ఎదురుగా కూర్చుని విసుగు పుట్టించేవాడు. ఆషాఢ మాసంలో అత్త వారింటికి రాకూడదని అయిన వాళ్ళెంత చెప్పినా విన కుండా వచ్చేవాడు. "అదేవిఁటండీ, అందరూ ఏమను కుంటారు ?" అంటే "శకుంతలా, నిన్నుచూడక పోతే పిచ్చెత్తేసట్లుంటుంది." అనేవాడు. స్నేహితుల్నీ రాజ కీయాలనూకూడా మరిచిపోయాడు. "శకూ, నాలోని ప్రతి జీవాణువూ, నా జీవితంలోని ప్రతి నిమిషమూ నీలో ఐక్యం కావాలని ప్రయత్నిస్తుంటుంది." అనేవాడు. అలాంటి మనిషి ఎలా మారిపోయాడు! ఆ గదిలో పందిరి మంచం ఫోటోలు తమ మూగభాషలో అదే మాటల్ని వల్లించాయి.

మూడు మాటలు మాట్లాడితే అందులో రెండు ప్రశ్నలు, ఒక ఆర్డరు! అసలు ఈ ఊరు వచ్చినప్పటి నుంచే పుట్టింది ఈ బుద్ధి యీ మనిషికి. ఆ మాయదారి పిల్లలతోటే ఈయన లోకమంతా! పరాయి పిల్లల తోటే పరవశత్వం పొందే ఈయనకు సొంత బిడ్డలుంటే యింకా చుట్టూ ఉన్న ప్రపంచం గుర్తుంటుందా!

సత్యం తండ్రి అవుతాడు. ఆ బిడ్డే ప్రపంచం. అతనికి ఇంకెవరి అవసరమూ ఉండదు. తన అవసరం ఇక తీరినట్టే. తను చచ్చినా బ్రతికినా ఒకటే ! ఇకముందు తను వంట మనిషి మాత్రమే కాదు-దాసీది కూడా !

ఇక తన వయస్సూ, అందం ఎవరికీ అవసరంలేదు. పిల్లల తల్లి ఒక యంత్రం! పొద్దున్నే లేస్తుంది. వండుతుంది, పెడుతుంది. కడుగుతుంది, మళ్లీ వండుతుంది. తను తిన్నా తినకపోయినా పట్టించుకొనేవాళ్ళు ఉండరు. పిల్లలూ, భర్తా నిద్రపోయింతరవాత అరిగిపోయి వాలిపోయిన యంత్రాన్ని మంచంమీద భారంగా చేరుస్తుంది అంతే !

ఏయ్ నిన్నే ! పాప అలాగుక్కపట్టి ఏడుస్తుంటే గొడ్డులా మీదపడి నిద్రపోతావే?

వీపు తట్టినట్లయింది శకుంతలకు, ఉలిక్కిపడింది. చేతిలో పుస్తకం కింద పడింది. కట్టలు తెంచుకొని ఏడుపు వస్తోంది. రెండు చేతులలో ముఖాన్ని దాచుకొని వచ్చే ఏడ్పుని దిగమింగే ప్రయత్నంలో వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఆ రోజు సాయంకాలం తన కాలేజీలో పని చేసే స్నేహితులందరికీ స్వీట్‌తో సహా కాఫీ యిప్పించడం, మంచి జోరుగా మాటలు దంచేయడం, మొత్తంమీద సత్యనారాయణ ప్రవర్తనలోని యీ ప్రత్యేకతకు తగినంత కారణం ఉండి ఉండాలనే విషయాన్ని కొంతమంది కనిపెట్టారు. ఊరుకోబట్టలేక ఒకాయన - "ఏరోయ్!" షోతగా ఉంది వ్యవహారం! ఎక్కడన్నా పట్టావా ఏం?"

"అబ్బే! నీ మొహం! అదేం లేదురా!"

"ఐతే, ఏ ముసలమ్మనాన్నా ఊడి పాపం, ఏమన్నా వచ్చిందా ?

"అలాంటి అవకాశాలు లేవుగా మనకి, "

"మరి సంగతేవిఁటి ?" అని రాముం అంటూఉంటే నాలుక చివరిదాకా వచ్చినదాన్ని పళ్ళతో బిగపట్టుకొన్నాడు సత్యం పదిమంది ఉన్నారని. విడివిడిగా అయితే పది కాదు ఇంకో పదిమందికైనా చెప్పేవాడే!

స్నేహితులకు గుడ్‌బై చెప్పి చైనా బజార్నె వస్తూఉంటే, ఒక షాపువాడు కొట్లో ఉన్నవన్నీ ఊరికే ఇస్తున్నట్లుగా కేకలు వేస్తున్నాడు. చుట్టూ చేరినజనంలో ఒకామె పసి పిల్లాడికి రబ్బరు బొమ్మ కొంటున్నది. అప్రియత్నంగానే ఆగిపోయాడు సత్యం. అతని దృష్టిని ఆ రబ్బరుబొమ్మ ఆకర్షించింది. ఒకటి కొని జేబులో వేసుకొని యింటివైపు వేగంగా నడుస్తున్నాడు సత్యం. బుర్రనిండా ఆలోచనలు పొర్లిపోతున్నాయి. సాయంకాలం ఎండ చిటచిటలాడుతోంది.

"ఒరేయ్ సత్యం, అసలు క్లబ్బుకు రావడమే మానేశావేరా?" వెంకటేశం ఒక పీనెడు గుద్దు వేశాడు సత్యం వీపుమీద.

"వాడికెక్కడ తీరుతుందిరా? అమ్మగారి సేవతోనే .... సిగరెట్టొకటి ఇలా తగలేయరా." అంటూ చౌదరి జేబులో చెయ్యి పెట్టనే పెట్టాడు.

"ఇస్తానుండరా? అంటూ సత్యం అతని చేయి పట్టుకోబోయేసరికే రబ్బరు బొమ్మను బయటికి లాగాడు చౌదరి.

"అదా సంగతి!" ఇద్దరూ వెకిలిగా నవ్వారు.

"టీ పార్టీ అన్నా చేయలేదేఁవిరా? అబ్బాయా? అమ్మాయా?"

దొంగతనంచేసి పట్టుబడ్డవాడికి మల్లే మొహంవేసి, "ఇంట్లో చుట్టాలున్నారు. పోవాలి." అంటూ బలవంతం మీద వాళ్ళను వదిలించుకొని యింటిదారిని పడ్డాడు చెమట తుడుచుకుంటూ సత్యం.

జేబులో వున్న రబ్బరు బొమ్మ చక్కిలిగింతలు పెడ్తూందేమో! తనలో తను ముసి ముసిగా నవ్వుకుంటున్నాడు. నడుస్తూనే ఆలోచనలలో తేలిపోతున్నాడు. తను 'తండ్రి' కాబోతున్నాడు.

ఇకనుంచి యింటికి ఆలస్యంగా రావడానికి వీల్లేదు. ప్రతిరోజూ పాపకు తినడానికి ఏమైనా తీసుకెళ్ళాలి. అమ్మతో వంటింట్లోవున్న చిట్టి కళ్ళలోకి పొగ పోయి ఏడుస్తుంటే, స్వీట్స్ పెట్టి తను ఏడుపు మాన్పిస్తాడు. వచ్చీ రాని మాటల్తో నత్తిగా 'ఊఁఊఁ అమ్మకొట్టింది'

అని ఏడుస్తుంటే, 'ఉస్ .... అమ్మను కొడదాంలే' అని తను చప్పట్లు కొడతాడు. రోజూ ఈ వేళకి బాబు గేటులో నుంచుని ఎదురుచూస్తుంటాడు తనకోసం - కాదు - తను తెచ్చే స్వీట్సుకోసం. కొంచెం ఆలస్యమైతే ఏడుస్తూ - 'నాన్న రాలేదు .... ఊఁ ఊఁ' అంటూ కూని రాగాలుతీస్తుంటే శకు ....

తక్కున ఎవరో వీపు తట్టినట్లు వీధి వాకిలికి వేసి ఉన్న ఇంతలావు తాళంకప్ప అతన్ని ఆలోచనలనుంచి తట్టి లేపింది. శకుంతల ఈ సమయంలో ఎప్పుడూ ఎక్క డికి వెళ్ళదు. సత్యానికి ఏమీ అర్థం కావడం లేదు. అలాగే కళ్ళప్పగించి తాళంకేసి జాలిగా, భయంగా చూచాడు. ఎన్నెన్నో అనుమానాలూ, ఊహాలూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

"ఇదిగో తాళంచెవి! మరేఁ బాబాయోయ్! పిన్నేమో, ఊరు కెళ్ళింది!" చిట్టి మాటలకు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూచాడు. కొంచెం దూరంలో చిట్టి తల్లి నుంచొని ఉంది.

"శకుంతల వాళ్ళన్నయ్యతో మధ్యాహ్నం బండికి ఊరెళ్లింది. ఆ విషయం మీరు ముందే మాట్లాడుకొని ఉంటారు. తాళంచెవి యివ్వమని చెప్పింది." అంది ఆమె.

సత్యం ముఖంలోని ఆదుర్దానూ, ఆశ్చర్యాన్నీ దాచుకుంటూ, "అవునండీ, నిన్ననే వాళ్ళన్న వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది." అన్నాడు.

కోటుకూడా విప్పకుండానే కుర్చీలోకూలబడ్డాడు. కోటు జేబులోని రబ్బరు బొమ్మ చక్కలిగింతలు పెడు

తోంది. అప్రయత్నంగా దానిని బయటికిలాగి విసిరి కొట్టాడు. కాళ్ళూ చేతులూ, వెనక్కి తిరిగి వికృతంగా ఉన్న ఆ బొమ్మ సత్యం ముఖంలోకి జాలిగా చూచింది. ఆ పక్కనే ఉన్న చిట్టి పరుగెత్తుకొచ్చి బొమ్మను ఎంతో ఆదుర్దగా చేతిలోకి తీసుకొని దానికి మాటలు చెబు తున్నది.

"బాబాయ్ కొట్టాడా బాబూ? ఏడవకు. నా చిట్టితండ్రే! నీకు పెప్పరమెంట్లు పెడతాగా!"

ఆ మాటలు వింటున్న సత్యానికి ఆశ్చర్యం వేసింది. ఇంత చిన్నపిల్లలో కూడా మాతృత్వం కనిపిస్తున్నది. ఇది సృష్టిలోని అమరత్వం. కాని తన శకు....ఆ పేరు తలు చుకొంటేనే అసహ్యంగా ఉంది తనకు. కళ్ళముందు శకుంతలరూపం పెద్ద కొండచిలువలాగా జరజరా పారి పోయింది.

ఎన్నో ఆలోచనలు పొర్లుకొస్తున్నాయి. ఎంతో బాధగా లేచి లోపలికెళ్ళాడు. ఎదురుగా టేబిలు మీద తన పేరు రాసిన కవరు కనిపించింది. అది శకుంతలదే. చింపివేయడానికి కసితో రెండుచేతుల వేళ్ళతో పట్టు కున్నాడు కాని చింపలేకపోయాడు.

ఉత్తరం చదివి దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో కూల బడ్డాడు. తను ఎంత తెలివితక్కువగా ప్రవర్తించాడో అర్థమయింది. సైకాలజీ అంతా ఆలోచనం చేసి, కాలే జీలో రోజూ భిన్న మనస్తత్వాలను గురించి లెక్చర్సు ఇచ్చే తనే, భార్య మనస్తత్వాన్ని అర్థంచేసుకో లేక

ఆమెను అసహ్యించుకున్నాడు. ఆమె యెడల తన ఉపేక్షే ఆమెను అలా తయారు చేసింది. పగలంతా యింటిపనిచేసి సాయంకాలానికి చక్కగా ముస్తాబయి, చిరునవ్వులు ఒలకపోసుకొంటూ ఇంతింత కళ్లు చేసుకొని తనకోసం ఎదురుచూచేది. కానీ తనో-ఆపిల్లలతో ఆమె విషయాన్నే మరిచిపోయేవాడు. దెబ్బతిన్న ప్రేమ ద్వేషంగా మారింది. స్త్రీ ఎంత తీవ్రంగా ప్రేమిస్తుందో, అంత తీవ్రంగా ద్వేషిస్తుంది. అది తను అర్థంచేసుకోలేక ఆమెను అపార్థం చేసుకుంటూ తమ మధ్య ఏర్పడ్డ అగాధాన్ని ఇంకా పెద్దదిగా చేశాడు. ఆమె ఎంతగా బాధపడ్డదో!

గతించినదానికి విచారించడంకంటే ముందు మార్గం ఆలోచించడం మేలనుకొన్నాడు. తన సైకాలజీ జ్ఞానాన్నంతా ఉపయోగించి ఆలోచించాడు.

అవును. ఇక తను పుట్టబోయే బిడ్డనుగురించి గానీ పుట్టింతర్వాతగానీ ఏమీ రాయకూడదు. పుట్టబోయే పిల్ల అంటేతనకుఎలాంటిఅపేక్షాలేనట్టునటించాలనుకున్నాడు. శకుంతలను మార్చలేకపోతే తమబ్రతుకులే బండలపాలవుతాయి. అర్థంకాని తమ వ్యర్థ జీవితాల మధ్య తమ సంతానం నలిగిపోయి వికృత మనస్తత్వాలతో తయారు కావచ్చును. తను ఏర్పరచిన ఆ అగాధాన్ని తనే పూడ్చాలి. లేకపోతే ఎన్ని ప్రాణాలు దాంట్లో పడి విలవిలలాడుతాయో!

సత్యం మనస్సు కొంచెం తేలికపడింది. లేచి తన గదిలోకి వెళ్ళి "ఫ్రాయిడ్" పుస్తకం ఒకటితీసి చదవడం ప్రారంభించాడు.

* * * *

సత్యం కాలేజీకి సెలవు పెట్టి భార్యకోసం ఆత్రంగా ఎదురుగాచూస్తున్నాడు. బయటికి రావడం, మళ్లీ నిరాశతో లోపలికి వెళ్ళడం కాలుకాలిన పిల్లిలా ఉంది అతని పని. ఆమె ఉత్తరాలవల్ల శకుంతల పూర్తిగా మారిపోయినట్లు తెలిసిపోయింది. నాలుగు పేజీల ఉత్తరంలో మూడున్నర పేజీలు తన పాపను గురించే తను పాపను చూడడానికి ఎంత బాధపడుతున్నా ఉత్తరంలో ఆ విషయం — అసలు తనకు ఒక పాప అంటూ ఉన్నదనే విషయమే గుర్తు లేనట్లు ఉత్తరం రాసేవాడు. అలా రాస్తున్నంతసేపూ హృదయంలో ఎవరో బాకు ఎత్తి పొడిచినట్లుండేది. కాని శకుంతలలోని మార్పు ఆ బాధకు కొంత ఉపశమనంగా ఉండేది. చివరికి తన ఉపేక్ష శకుంతలనుకూడా బాధపెట్టిందిలాగుంది. ఈ మధ్య ఉత్తరాలు రాయడమే మానేసింది. లేకపోతే పాపలోకంలో తన విషయమే మరిచిపోయిందో! ఆ విషయం ఆలోచిస్తుంటే మధ్యవచ్చిన ఆ అర్భకుడిమీద కోపం వస్తుంది. తనకోపానికి మరల తనే నవ్వుకొనేవాడు.

ఈరోజు తను స్టేషన్‌కుకూడా వెళ్ళలేదు. శకుంతల ఎంత రోషంతో వచ్చి దిగుతుందో !

వాకిట్లో బండి ఆగిన చప్పుడై ఒక్క దూకులో బయటపడ్డాడు. ఇన్ని రోజులుగా అణచుకున్న ఆ వాత్సల్యం కట్టలు తెంచుకుంది. పచ్చగా బొద్దుగా, అచ్చంగా తనలాగే ఉన్న పాపను అమాంతంగా శకుంతల దగ్గర నుంచి లాక్కోవాలనిపించింది. కానీ భావావేశాన్ని

అణుచుకో ప్రయత్నిస్తూ "హల్లో! శకున్కా, ఏఁ అంత చిక్కిపోయావు ? ఒంట్లో బాగాలేదా ?" ఏదేదో మాట్లాడేస్తున్నాడు. తన మాటలకు అర్థం తనకే తెలియడంలేదు.

శకుంతల కోపంతో మూతిని సున్నాచుట్టి చరచరా లోపలికి పోయింది, బండీవాడికి డబ్బిచ్చి ఆనూ వెంబడించాడు.

"ఏఁ శకున్కా! స్టేషన్‌కు రాలేదనా అంత కోపం ?"

శకుంతల కళ్ళనుంచి నీరు జరజరా కారింది.

"ఏఁ శకున్కా....ఎందుకు ఏడుస్తున్నావు ?" అంటూ గాబరాగా దగ్గరికి పోయాడు సత్యం.

"మీరు....ఎంత మారిపోయారు ?" అంది. వచ్చే దుఃఖాన్ని ఆపుకొంటూ శకుంతల.

సత్యం అర్థంకాక తికమక పడ్డాడు. బహుశా తను హోటలు తిండి పడక చిక్కిపోయాడని బాధ పడుతోందేమో ననుకున్నాడు.

"పాపను చూడడానికి ఒక్కసారైనా వచ్చారా ? మీదెంత రాతిగుండె అండీ !" అంటూ బాధగా చంకలో ఉన్న బిడ్డను హృదయానికి హత్తుకుంది.

సత్యం కళ్ళల్లో ఒక్కసారిగా కాంతిరేఖలు కదిలిపోయాయి. ఇక తన ఆవేశాన్ని ఆపుకోలేక పోయాడు. శకుంతల ఒళ్లోని పాపను లాక్కొని ముద్దులవర్షం కురిపించసాగాడు. పాప బిగ్గరగా ఏడుస్తోంది. సత్యం ఇంకా గట్టిగా ముద్దులు కురిపిస్తున్నాడు.

శకుంతల బిడ్డను లాక్కుంటూ "మరీ అంత మొర టుగానటండీ! పసిపిల్లను ముద్దులాడేదీ!" అంది.

శకుంతల సత్యాల దృష్టులు ఆ పక్కనే ముఖ మంతా కళ్లు చేసుకొని 'పిన్ని చంకలోని పాపను' చూస్తూన్న పక్కింటి చిట్టీ, మాస్టరుగారి అబ్బాయి మీదా పడ్డాయి. సత్యానికి వాళ్లను దగ్గరికి తీసుకోవాలనిపించింది. కాని శకుంతల దగ్గర ధైర్యంలేక తల వంచు కున్నాడు.

శకుంతల తన పాపను సత్యానికి అందించి వాళ్ళి ద్దర్నీ దగ్గరకు పిల్చి పెప్పరమెంట్లు పెట్టింది. తన వంక కొంత ఆశ్చర్యంతో కొంత భయంతో చూస్తూన్నవాళ్లను ముద్దుపెట్టుకుంటూ "పాపతో ఆడుకోడానికి వస్తూ ఉండండేం" అంది శకుంతల.

ఇద్దరూ చేతుల్లోని పిప్పరమెంట్లు అన్నీ ఒక్కసారి నోట్లోకుక్కుకొని ఉబ్బిన బుగ్గలతో తలలు తిప్పుతూ పరుగెత్తారు.

"శకుంతల ఎంతగా మారిపోయింది? సృష్టికి ఎదురీదడం ఎవరి తరం.?" అనుకున్నాడు సత్యం. ఇద్దరి కళ్ళూ కలిశాయి. శకుంతల సిగ్గుతో వాలిపోయింది. ఇద్దరు మౌనంగా ఏదో ప్రపంచంలోకి వెళ్లిపోయారు. వాళ్లిద్దరి పరిస్థితిని అర్థం చేసుకున్నట్లు సత్యం చేతిలోని పాప మన స్తత్త్వవేత్తలా చిరునవ్వు నవ్వింది. ○